సాక్షి ప్రకాశం

శుక్రవారం । 24 । జనవరి । 2025

I



మాట వింటేనే ఎస్‌ఆర్‌లో సంతకం!

ముండ్లమూరు ఎంపీడీఓ వేధిస్తున్నాడంటూ ఆ మండలంలోని ఉమామహేశ్వరపురంలో పని చేస్తున్న మహిళా పోలీస్ అనూషా ఆవేదన వ్యక్తం చేశారు. - IIలో..



విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల విలీనం

విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలను విలీనం చేస్తామని విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు తెలిపారు. - IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31/20

ఉదయం పొగమంచు కురుస్తుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్‌ను కోరిన ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం నాయకులు



కలెక్టర్‌తో ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం నాయకులు

ఒంగోలు అర్బన్: మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ జయలక్ష్మి, తదితరులు గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి కోరారు. స్థానిక ప్రకాశం భవనంలో మహిళా విభాగం నాయకురాళ్లు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా అసోసియేషన్ కార్యకలాపాలకు కలెక్టర్ కార్యాలయంలో ఒక గది కేటాయించాలని కోరారు. అసోసియేషన్ భవనం ఏర్పాటు చేసుకునేందుకు కూడా స్థలం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

జమ్మూకాశ్మీర్‌లో టంగుటూరు విద్యార్థిని సత్తా



కోచ్‌తో నౌషద్ బేగం

టంగుటూరు: జమ్మూకాశ్మీర్‌లోని గుల్మార్గులో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి ఐస్ కార్లింగ్ పోటీల్లో టంగుటూరు మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని సత్తా చాటింది. షేక్ జాకీర్, షరీఫల ద్వితీయ కుమార్తె షేక్ నౌషద్ బేగం మిక్స్ టీంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. జాతీయ స్థాయిలో మెడల్ సాధించడంతో విద్యార్థినిని తల్లిదండ్రులు, కోచ్ వరికూటి యెహోషువా, టంగుటూరు వాసులు అభినందనలు తెలిపారు.

కుర్చీ ఆశలు కుదేలు..?

వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల రిజర్వేషన్ల వ్యవహారం అధికార కూటమికి తలనొప్పిగా మారింది. అధికార యంత్రాంగం రూపొందించిన జాబితాను టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకున్నా ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. ఇప్పటి వరకు ఈ పదవులపై ఆశలు పెట్టుకున్న వారు రిజర్వేషన్లతో కొత్త చిక్కు వచ్చిపడుతోందని ఆందోళన చెందుతున్నారు. దర్శి, కనిగిరి, యర్రగొండపాలెం కొలిక్కిరాలేదు.



- ఏఎంసీలకు తేలని రిజర్వేషన్లు
- కనిగిరి, దర్శిలో కొనసాగుతున్న ప్రతిష్టంభన
- యర్రగొండపాలెం మార్చేది లేదని స్పష్టం చేసిన పార్టీ పెద్దలు
- ఆశావహులకు తప్పని భంగపాటు
- పార్టీ, ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకున్నా ఫలితం లేదు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక మండళ్ల రిజర్వేషన్లతో అధికార పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలకు, ఇన్‌చార్జిలకు భంగపాటు తప్పేట్టు లేదు. జిల్లాలో ఒంగోలు, కనిగిరి, కొండపి, దర్శి, పొదిలి, మార్కాపురం, కంభం, గిద్దలూరు, యర్రగొండపాలెం మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటిలో దర్శి, కనిగిరి, యర్రగొండపాలెం, నియోజకవర్గాల్లో రిజర్వేషన్ల తఖరారు నడుస్తోంది. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల అభిప్రాయాలకు భిన్నంగా మంత్రులు, జిల్లా అధికారులు రిజర్వేషన్ల ఖరారుకు కసరత్తు పూర్తి చేసినట్లు ప్రచారం జరుగుతోంది. రిజర్వేషన్ల మార్పు ప్రక్రియ పేరుతో జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలకు, ఇన్‌చార్జిలకు చెక్ పెట్టనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు ఇచ్చిన మాట మేరకు తామే ఏఎంసీ చైర్మన్లమని అనధికారికంగా ప్రకటించుకున్న వారికి చుక్కెదురు కానుంది. పార్టీ పెద్దలు, మంత్రులు జోక్యం చేసుకున్నా ఫలితం కనిపించలేదు. బుధవారం జిల్లా కేంద్రంలో సుదీర్ఘంగా మంతనాలు జరిపినా ఇంకా కొలిక్కిరాలేదని సమాచారం. ఇప్పటి వరకూ ఉన్న సమాచారం మేరకు ఒంగోలు, కనిగిరి ఎస్సీలకు, దర్శి ఎస్సీ, యర్రగొండపాలెం ఎస్టీకి కేటాయించినట్టు సమాచారం.

కనిగిరిలో ఆశావహునికి నిరాశ తప్పదా..?

కనిగిరిలో ఏఎంసీ చైర్మన్ తానేనంటూ ప్రచారం చేసుకుంటున్న పామూరుకు చెందిన టీడీపీ నేతకు నిరాశ తప్పదని తెలుస్తోంది. పార్టీ అధికారంలోకి రాగానే పామూరు టీడీపీ నాయకుడైన శ్రీను చౌదరి తానే ఏఎంసీ చైర్మన్ అంటూ ప్రకటన చేసుకున్నాడు. అనధికారికంగా కనిగిరిలో ఏఎంసీ కార్యాలయానికి వచ్చి చైర్మన్ కుర్చీలో కూర్చున్నారు కూడా. అయితే రిజర్వేషన్ల మార్పుతో ఇతనికి భంగపాటు తప్పేట్టులేదు. ఎమ్మెల్యే సైతం చౌదరికే మద్దతిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. సామాజికవర్గ బలంతో పట్టుబట్టి సాధించుకుంటారా.. లేకుంటే అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటారా.? అనేది వేచి చూడాల్సి ఉంది.

గిద్దలూరు, కంభంలో పోటాపోటీ

గిద్దలూరు, కంభం ఏఎంసీ చైర్మన్ పదవులకు పెద్ద ఎత్తున పోటీ నెలకొంది. ఓసీ, బీసీ నేతలు ఈ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే రిజర్వేషన్ల వ్యవహారం తేలకపోవడంతో నేతల్లో గందరగోళం నెలకొని ఉంది. ఇక, మార్కాపురం చైర్మన్ పదవికి ఎలాంటి ఇబ్బంది లేనప్పటికీ పొదిలికి సంబంధించిన నాయకులు ప్రతిపాదించిన వ్యక్తి తనకు ఆ పదవి వద్దంటూ తిరస్కరించినట్టు ప్రచారం జరుగుతోంది. యర్రగొండపాలేనికి సంబంధించి అక్కడ పార్టీ ఇన్‌చార్జి ఎస్సీ చేయమని డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. అయితే మార్పు చేసేది లేదని, ఎస్టీనే కొనసాగిస్తామని పార్టీ పెద్దలు స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. దర్శి నియోజకవర్గానికి సంబంధించి ఎస్సీకి కేటాయించినట్లు తెలియగా, అక్కడ ఇన్‌చార్జి మాత్రం రిజర్వేషన్ మార్చాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. ఒంగోలుకు సంబంధించి రిజర్వేషన్ ఎస్సీ అయినట్లు ప్రచారం జరుగుతుండగా ఇక్కడ నాయకులు మాత్రం ఓసీకే ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి.

కొండపిలో భారీ ట్విస్ట్...

కొండపి నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెటింగ్ యార్డు చైర్మన్ పదవికి సార్వత్రిక ఎన్నికలకు ముందు పొన్నలూరు మండలం పైరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ సుబ్బమ్మ తనయుడు కర్నా కోటిరెడ్డిని ఎంపిక చేస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారు. దీంతో కాబోయే ఏఎంసీ చైర్మన్ కోటిరెడ్డి అని అందరూ చర్చించుకున్నారు. తీరా చైర్మన్ పేరు ప్రతిపాదన చేసే సమయానికి అకస్మాత్తుగా పొన్నలూరు మండలానికి చెందిన మాజీ ఎంపీపీ, పార్టీ మండల అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాసరావు పేరు తెరపైకి వచ్చింది. అంతేగాకుండా శ్రీనివాసరావుకి మంత్రి అనుంగ అనుచరుడుగా పేరు ఉండటంతో పాటు ఆర్థికంగా బలవంతుడు. ఇతను ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నాడన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఇక్కడ బలంగా ఉన్న మారిటైం బోర్డు చైర్మన్ ఆశీస్సులు ఎవరికి ఉన్నాయో తేలాల్సి ఉంది.

దాడులు, అఘాయిత్యాలతో అరాచకపాలన



మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

- రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులను భయాందోళనకు గురిచేస్తున్న కూటమి ప్రభుత్వం
- మాజీ మంత్రి మేరుగు నాగార్జున

ఒంగోలు సిటీ: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు, అఘాయిత్యాలకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తూ అరాచకపాలన సాగిస్తున్నారంటూ కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. టీడీపీ నేతలు పెట్టిన అక్రమ కేసుల వల్ల రిమాండ్‌లో ఉన్న ఏడుగురు అమాయక యువకులను ఒంగోలులోని జిల్లా జైలులో గురువారం మేరుగు నాగార్జున కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధం లేని కేసుల్లో ఇరికిస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలను భయాందోళనకు గురిచేస్తున్న పరిస్థితులు నేడు కనిపిస్తున్నాయన్నారు. నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో అధికార పార్టీ ఒత్తిడి మేరకు ఏ సంబంధం లేని కూలి చేసుకునే యువకులను కేసులో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మనబ్రోలులో కష్టం మీద బతికే వారిని గేదె దగ్గర గొడవ అని తీసుకొచ్చి కేసులు పెట్టి ఏడుగురిని జైలుకు పంపించడం దారుణమన్నారు. అమ్మనబ్రోలుకు చెందిన సాయి అనే యువకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టడం అన్యాయమన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు నిజమైన హక్కులు కాపాడుకోవడానికేగానీ.. వేధించడానికి కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేయవద్దని పోలీసులు, కేసులు పెట్టేవారు, ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. అమ్మనబ్రోలులో సాయి అనే బీసీ యువకుడు వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు కట్టాడని, ఫ్లెక్సీల దగ్గర గొడవైందని, బూతులు తిట్టాడనే కారణంతో ఒక గిరిజన అమ్మాయితో కేసు పెట్టించి జైలుకు పంపడం దారుణమని మేరుగు నాగార్జున అన్నారు. ఇలాంటి కేసులు రాబోయే రోజుల్లో టీడీపీ నేతలపై కూడా పెట్టే రోజులు వస్తాయని, అందువలన ఈ కేసులను దుర్వినియోగం చేసుకోవద్దని అన్నారు. ప్రభుత్వం పరిపాలనను గాలికొదిలేసి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీ కనిపిస్తే టీడీపీ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. అక్రమ కేసులపై పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. టీడీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ కట్టినందుకే నా బిడ్డపై కుట్ర...

బాధితుడు సాయి తల్లి సలోమి మాట్లాడుతూ తన బిడ్డ వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ కట్టినందుకు ఆ ఫ్లెక్సీ చింపారని, పైగా, తన బిడ్డను జైలు పాలు చేశారని కన్నీరుమున్నీరుగా విలపించారు. తన బిడ్డకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.

దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు అట్టర్‌ఫ్లాప్...

దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు అట్టర్‌ఫ్లాప్ అయ్యారని మేరుగు నాగార్జున విమర్శించారు. పట్టుమని పది కోట్లు పెట్టుబడులు తేలేకపోవడం సిగ్గుచేటన్నారు. పక్క రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వం లక్షా 32 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు సాధించిందన్నారు. పవన్‌కళ్యాణ్‌ని సైడ్ చేసి లోకేష్‌ని ప్రమోట్ చేయడానికే చంద్రబాబు, లోకేష్ పర్యటన అని అన్నారు. చంద్రబాబు దావోస్ పర్యటన ద్వారా ఏం సాధించారనే దానిపై పవన్ కళ్యాణ్ నిలదీయాలన్నారు. మేరుగు నాగార్జున వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఇనగంటి పిచ్చిరెడ్డి, పోలవరపు శ్రీమన్నారాయణ, కొమ్మూరు సుధాకర్, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, తేళ్ల పుల్లారావు, పోలినేని కోటేశ్వరరావు, కోయ హనుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లలోనూ పచ్చ దందా..!

- మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో టీడీపీ నేత కర్రపెత్తనం
- రూ.10 లక్షల్లోపు రిజిస్ట్రేషన్లకు ఒక శాతం కమీషన్
- రూ.10 లక్షలు దాటితే 0.5 శాతం కమీషన్
- ఆందోళనలో ఆస్తుల కొనుగోలు, అమ్మకందారులు
- ఇతర ప్రాంతాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్న వైనం



మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షి టాస్క్‌ఫోర్స్: కాదేదీ అక్రమార్జనకు అనర్హం అన్నట్లుగా టీడీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో ఆగ్రహం తెప్పిస్తోంది. ఇసుక, మట్టి, లిక్కర్ అక్రమ వ్యాపారాలతో పాటు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుపై కూడా ఒక టీడీపీ నేత కన్నేశాడు. పశ్చిమ ప్రకాశంలో ముఖ్యకేంద్రమైన మార్కాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న ఈ వ్యవహారం జిల్లా వ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎక్కడా జరగని విధంగా ఇక్కడ ప్రతి రిజిస్ట్రేషన్‌లో రూ.10 లక్షల విలువకు ఒక శాతం కమీషన్‌ను కొనుగోలుదారుడు ఇవ్వాల్సి వస్తోంది. దీంతో మార్కాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి వివరాలు తెలుసుకుని అదనపు చార్జీలు చెల్లించలేక జిల్లా దాటి ఇతర ప్రాంతాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నెల 1 నుంచి జరిగే ప్రతి రిజిస్ట్రేషన్‌లో భాగంగా ఆస్తి విలువను బట్టి లక్ష రూపాయలకు 1 శాతం పర్సంటేజీని కొంత మంది డాక్యుమెంటు రైటర్లు కొనుగోలుదారుల వద్ద నుంచి వసూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేసిన మొత్తాన్ని సాయంత్రం ఆఫీసు పనివేళలు ముగిసిన వెంటనే సదరు టీడీపీ నేత ఇంటికి వెళ్లి చెల్లించి వస్తున్నారు.

ప్రతిరోజూ 40 నుంచి 50 వరకూ రిజిస్ట్రేషన్లు...

మార్కాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతిరోజూ సగటున 40 నుంచి 50 వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఎక్కువగా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. ఒక్కో ప్లాటును, ప్రాంతాన్ని బట్టి వాటి విలువ ఉంటుంది. పట్టణ నడిబొడ్డున ఒక ధర, శివారు ప్రాంతాల్లో మరో ధర ఉంటుంది. ఇక్కడే డాక్యుమెంటు రైటర్లు రంగ ప్రవేశం చేసి విలువ ఎక్కువగా చూపి అధికారుల వద్దకు వెళ్లి తాము తగ్గిస్తామంటూ మాట్లాడటంతో పాటు కొనుగోలుదారుల వద్ద నుంచి అదనంగా వసూలు చేస్తున్నారు.

వసూళ్లు ఇలా...

ఆస్తి విలువ 10 లక్షల రూపాయల్లోపు ఉంటే ఒక శాతం ప్రకారం, రూ.10 లక్షలు దాటితే 0.5 శాతం ప్రకారం అదనంగా నగదు వసూలు చేస్తున్నారు. ఆ నగదును డాక్యుమెంటు రైటర్ వసూలు చేసి సదరు టీడీపీ నాయకుడు చెప్పిన వ్యక్తికి ఇస్తున్నారు. కాదని సదరు రిజిస్ట్రేషన్‌దారులు ప్రశ్నిస్తే దానికి సరిపడా డాక్యుమెంట్లు లేవని ఏదో ఒక సాకు చూపి రిజిస్ట్రేషన్ నిలిపివేస్తామని బెదిరిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా.. రోజుకు సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ సదరు టీడీపీ నేత జేబులోకి వెళ్తోంది. కాగా, ఈ దోపిడీని ఎదిరిస్తున్న కొందరు తమ రిజిస్ట్రేషన్లను వినుకొండ, పొదిలి, కనిగిరి, కంభం, యర్రగొండపాలెం తదితర ప్రాంతాలకు వెళ్లి చేయించుకుంటున్నట్లు తెలిసింది. గతంలో రిజిస్ట్రేషన్ చేయాలంటే కొనుగోలుదారు అమ్మకందారులిద్దరూ సబ్‌రిజిస్ట్రార్ ఎదుట నిలబడి ఆయన అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. సబ్ రిజిస్ట్రార్ సంతృప్తి చెందితేనే రిజిస్ట్రేషన్లు జరిగేవి. కానీ, ఇటీవల ఈ విధానానికి స్వస్తిపలికి కార్యాలయం బయటే వేలిముద్రలు వేయించి పంపడం కూడా విమర్శలకు తావిస్తోంది.

ఆఫీసులో అవినీతి ఇలా...

మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి నిలయంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి రిజిస్ట్రేషన్‌కు ఫీజుతో పాటు పైఫీజు కూడా వసూలు చేస్తున్నారు. ఒక డాక్యుమెంటు రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వ ఫీజులు రూ.20 వేలు ఉంటే కొనుగోలుదారు దగ్గర నుంచి అదనంగా రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ వసూలు చేస్తున్నారు. దీంతో పాటు ఈసీకి చలానాతో పాటు అదనంగా రూ.1,500 నుంచి రూ.2 వేలు వసూలు చేస్తున్నారు. మ్యారేజీ సర్టిఫికెట్‌కు రూ.3 వేలు, ఆర్‌హెచ్ కాపీకి రూ.300.. ఇలా ప్రతి పనికి పర్సంటేజీలు వసూలు చేస్తున్నారు. కాగా, ఇటీవలే ఒక నిఘా సంస్థకు చెందిన అధికారి వద్ద కూడా రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అదనంగా డబ్బు వసూలు చేయడంతో సదరు అధికారి నిఘావర్గాలకు రిపోర్టు పంపినట్లు తెలిసింది. దీంతో అప్రమత్తమైన కార్యాలయ సిబ్బంది లంచాల నగదును ఆఫీసు పనివేళలు దాటిన తర్వాత రహస్య ప్రాంతాలకు వెళ్లి డాక్యుమెంట్ రైటర్ల ద్వారా తీసుకుంటున్నట్లు సమాచారం.

హవ్వ.. ఇంత అక్రమమా

- అక్రమంగా విద్యుత్ వాడకం
- 10 రోజుల నుంచి యథేచ్ఛగా నగరం నడిబొడ్డులో జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- 'సాక్షి'లో కథనం రావడంతో అంచనాలు రూపొందించే పనిలో నిమగ్నం





ఎన్టీఆర్ కళాపరిషత్ వేదిక నుంచి విద్యుత్ మెయిన్ లైన్‌కు కలిపిన తీగలు

ఒంగోలు సబర్బన్: నగరంలోని పీవీఆర్ గ్రౌండ్స్‌లో ఎన్‌టీఆర్ కళాపరిషత్ సాంస్కృతిక సంబరాలకు మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు అడ్డగోలుగా, అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్నారు. దీనిపై సాక్షి దినపత్రిక ప్రధాన సంచికలో 'ఎన్‌టీఆర్ కళా సంబరాలకు విద్యుత్ చౌర్యం' పేరుతో గురువారం కథనం ప్రచురితమైంది. ఆ కథనంతో ఒంగోలు నగర విద్యుత్ శాఖ అధికారుల్లో కదలిక మొదలైంది. వారం పది రోజుల నుంచి అక్రమంగా విద్యుత్ వాడుకుంటూ చౌర్యం చేస్తుంటే చూస్తూ ఊరుకున్న ఒంగోలు నగర విద్యుత్ శాఖ డీఈ, సబ్ స్టేషన్–1 ఏఈలు అక్రమ విద్యుత్ వాడకంపై ఇప్పటి వరకు ఎంత వాడుకున్నారు, ఎన్ని యూనిట్లు వాడుకుని ఉంటారనే అంచనాలు రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. అంటే.. ఇప్పటి వరకూ ఎన్‌టీఆర్ కళా పరిషత్ నిర్వాహకులతో ఒంగోలు నగర విద్యుత్ శాఖ అధికారులు ఏ స్థాయిలో కుమ్మక్కయ్యారో అర్థం చేసుకోవచ్చు.

ఎన్‌టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలను ఈ నెల 18వ తేదీ నుంచి నగరంలోని పీవీఆర్ హైస్కూలు గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నారు. నాటకోత్సవాల ప్రారంభం నుంచే ఈదర హరిబాబు అక్రమంగా, నేరుగా విద్యుత్ మెయిన్ లైన్ నుంచే సరఫరా తీసుకుని విద్యుత్ వాడుకుంటున్నారు. బుధవారానికి వారం రోజులుగా వరుసగా రాత్రి వేళ విద్యుత్ వెలుగుల్లో నాటకోత్సవాలు నిర్వహిస్తున్నారు. నాటకోత్సవాల ప్రారంభానికి రెండు రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేస్తూ వచ్చారు. ఏర్పాట్లు ప్రారంభం నుంచే విద్యుత్‌ను అక్రమంగా వాడటం ప్రారంభించారు. భారీ విద్యుత్ ఫ్లడ్ లైట్లు, విద్యుత్ దీపాల అలంకరణ, స్టేజీ, అందులో ఫ్లడ్ లైట్లు ఇలా ప్రతిరోజూ వందల యూనిట్లు అక్రమంగా వినియోగిస్తూ విద్యుత్ సంస్థకు రూ.లక్షల్లో బిల్లులు కట్టకుండా ఎగ్గొడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఒంగోలు నగరంలోని విద్యుత్ శాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. సామాన్యుడి ఇంటికి ఒక నెల విద్యుత్ బిల్లు కట్టకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేసే విద్యుత్ అధికారులు.. ఇంతటి పెద్ద స్థాయిలో విద్యుత్ అక్రమంగా వాడుతుంటే కనీసం వారం, పది రోజుల నుంచి ఏం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నామమాత్రంగా ఒక జనరేటర్‌ను ఉత్సవవిగ్రహంలా అక్కడ పెట్టి మరీ నేరుగా విద్యుత్ మెయిన్ లైన్ నుంచి అక్రమంగా విద్యుత్ వాడుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సరఫరా తీసుకుంటే ప్రత్యేకంగా మీటరు పెట్టాలి...

ఎవరికైనా తాత్కాలికంగా విద్యుత్ అవసరం ఉంటే ప్రత్యేకంగా మీటరు ఏర్పాటు చేసుకుని విద్యుత్ సరఫరా తీసుకోవాలి. అందుకుగానూ ముందుగానే రోజుకు ఎన్ని యూనిట్లు వాడుకుంటారు, ఎన్ని ఫ్లడ్ లైట్లు ఉన్నాయి, ఎన్ని కిలో వాట్ల (కేవీ) విద్యుత్ అవసరం అవుతుంది అనేదానిపై విద్యుత్ సంస్థకు ముందుగా డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అందుకుగానూ విద్యుత్ అధికారులు సామర్థ్యాన్ని బట్టి కెపాసిటీకి తగ్గట్టు మీటరు కూడా ఏర్పాటు చేస్తారు. ఎన్‌టీఆర్ కళాపరిషత్ నిర్వాహకుడు ఈదర హరిబాబు మాత్రం అలాంటి నిబంధనలేమీ పాటించడంలేదు. ఏపీసీపీడీసీఎల్‌కు డబ్బు చెల్లించలేదు, మీటరు పెట్టించుకోలేదు.


నిద్రపోతున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు...

విద్యుత్ సంస్థలో ఆపరేషన్‌కు సంబంధించి విద్యుత్ అధికారులు ఉన్నట్లే విద్యుత్ సంస్థ డీపీ విభాగం, విద్యుత్ విజిలెన్స్ విభాగం కూడా ఉంటుంది. ఆ విభాగానికి జిల్లా కేంద్రం ఒంగోలులోనే పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి ఒక సీఐ, పోలీస్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. ఇంతటి పెద్ద స్థాయిలో విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తుంటే విజిలెన్స్ అధికారులు మొద్దు నిద్రపోతున్నట్లున్నారా.. లేక నిద్ర నటిస్తున్నారా..? అనేది స్పష్టం కావాల్సి ఉంది. యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం జరుగుతుంటే సంబంధిత అధికారులపై, ఎన్‌టీఆర్ కళాపరిషత్ నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి మరి. ఇళ్లలో విద్యుత్ లోడుకంటే ఎక్కువగా ఒక ఫ్యాను ఉన్నా.. ఇళ్లకు వచ్చి మరీ పెనాలీలు వేసే విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఈ వ్యవహారాన్ని ఏ విధంగా చక్కదిద్దుతారో వేచి చూడాలి.

వెలిగొండ సాధనకు ఉద్యమాలు

- ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.4 వేల కోట్లు కేటాయించాలి
- పాలకుల నిర్లక్ష్యంతోనే పశ్చిమ ప్రకాశం వాసులు దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు
- సీపీఎం రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

కనిగిరి రూరల్: వెలిగొండ ప్రాజెక్టు సాధన కోసం పార్టీలకతీతంగా ఐక్యంగా ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. కనిగిరిలోని క్లబ్ రోడ్డు ఆవరణలో సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు అధ్యక్షతన గురువారం వెలిగొండ జలాల సాధన సదస్సు నిర్వహించారు. బీవీ రాఘవులు పాల్గొని మాట్లాడుతూ వెలిగొండ సాధన కమ్యూనిస్టు పార్టీల సమస్య మాత్రమే కాదని, ఇది ప్రజా సమస్య అని అన్నారు. పాలకుల నిర్లక్ష్యంతోనే పశ్చిమ ప్రకాశం ప్రజలు తీవ్ర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. మామ ఎన్టీఆర్ అంకురార్పణ చేస్తే.. అల్లుడు చంద్రబాబు శంకుస్థాపన చేసి వదిలేశారన్నారు. దేశంలో అత్యంత వెనుకబడిన ప్రాంతం ప్రకాశం జిల్లా అని, అటువంటి షాడో జోన్ ప్రాంతంపై పాలకులు తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టుకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు చంద్రబాబు ఆరాటపడుతున్నారని, అసలు నీటి వసతే లేని వెలిగొండపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. తక్షణమే బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు, రెండో దశలో మరో రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా ఆగ్రహానికి గురవుతారన్నారు. రూ.50 వేల కోట్లు ఖర్చు చేసి పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తే రూ.7 లక్షల ఎకరాలకు నీరందుతుందని, అదే వెలిగొండ నిర్మిస్తే పది వేల కోట్లతో మూడున్నర లక్షల ఎకరాలకు నీరందించే ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు రాబట్టడంలో సీఎం వద్ద ఉగ్ర రూపాన్ని చూపించడం లేదన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడంపై పాలకులు దృష్టి పెట్టాలని, అందుకు నిధుల కేటాయింపునకు స్థానిక నాయకులు ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. పీసీపల్లి, మోపాడును వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో చేర్చాలన్నారు. వెలిగొండ జలాలతోనే ఫ్లోరైడ్ సమస్యకు విముక్తి కలుగుతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు, నాయకులు జీవీ కొండారెడ్డి, సయ్యద్ హనీఫ్, కంకణాల ఆంజనేయులు, డి.సోమయ్య, ఊసా వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కంకణాల రమాదేవి, కే మాల్యాద్రి, ఎం.రమేష్, బడుగు వెంకటేశ్వర్లు, ఆర్.మాలకొండయ్య, పిల్లి తిప్పారెడ్డి, పి.మహేష్, ఎస్.బషీరా, లక్ష్మీప్రసన్న, నరేంద్ర, వీ మాలకొండారెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో బీవీ రాఘవులు మాట్లాడారు. అనంతరం పట్టణంలో వెలిగొండ జలాల సాధన సదస్సు ర్యాలీలో పాల్గొన్నారు. ఎర్ర జెండాలతో పట్టణమంతా ఎరుపెక్కింది. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి సుగుణావతమ్మ సెంటర్ వరకు భారీ ర్యాలీ సాగింది. డప్పుల హోరు, కోలాట ప్రదర్శనలతో పట్టణమంతా మార్మోగింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నేరేడుపల్లికి చెందిన చిన్నారులు ఉత్సాహంగా ఉద్యమ పోరాట గేయాలతో అలరించారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు.



సదస్సులో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

ఉత్తమ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డులకు జిల్లా అధికారులు ఎంపిక

ఒంగోలు అర్బన్: ఓటరు నమోదులో ప్రతిభ కనబరిచిన అధికారులకు ఎన్నికల సంఘం అందించే ఉత్తమ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డు–2024కు జిల్లా నుంచి పలువురు అధికారులు ఎంపికయ్యారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు నియోజకవర్గ ఈఆర్ఓ కె.లక్ష్మీప్రసన్న, సోషల్ మీడియా అండ్ సైబర్‌సెల్ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణకు అవార్డులు దక్కాయి. ఈనెల 25వ తేదీన నిర్వహించనున్న 15వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో వీరు అవార్డులు అందుకోనున్నారు.

'నా ప్రాణానికి రక్షణ కల్పించండి'

తర్లుపాడు: టీడీపీ నేతల భూకబ్జాపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఇటీవల ఫిర్యాదు చేశానన్న కోపంతో తనపై దాడి చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మండలంలోని బుడ్డపల్లి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు ఆందోళన వ్యక్తం చేశారు. తన ప్రాణానికి ప్రమాదం పొంచి ఉందని రక్షణ కల్పించాలని గురువారం పోలీసు అధికారులను కోరారు. ఇందుకు సంబంధించిన ఒక లేఖ సోషల్‌మీడియాలో వైరల్ అయింది. టీడీపీ నేతల భూ ఆక్రమణలపై ఫిర్యాదు చేయడం, విచారణ చేపట్టాలని సీఎంవో నుంచి ఆదేశాలు వచ్చినప్పటి నుంచి తనతో పాటు తన కుటుంబ సభ్యులను కూడా బెదిరిస్తున్నారని, తన ప్రాణానికి రక్షణ కల్పించాలని ఆ లేఖలో కోరారు. తనకు, తన కుటుంబ సభ్యులకు ఏదైనా జరిగితే టీడీపీ నేతలదే బాధ్యత అని ఏడుకొండలు స్పష్టం చేశారు.

ప్రకాశం బాలోత్సవ్ బ్రోచర్ల ఆవిష్కరణ



బాలోత్సవ్ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, సభ్యులు

ఒంగోలు సిటీ: ప్రకాశం బాలోత్సవ్ బ్రోచర్లను, ఎంట్రీ ఫారాలను ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ గురువారం విడుదల చేసినట్లు బాలోత్సవ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు లక్ష్మీనారాయణ, కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 38 అకడమిక్ అంశాలు, 17 కల్చరల్ అంశాలతో బాలోత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీలోగా ఎంట్రీ ఫారాలు అన్ని పాఠశాలలకు అందజేస్తామని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఫిబ్రవరి 8వ తేదీలోగా పంపాలని సూచించారు. ఎంట్రీ ఫారాలు వాట్సప్‌లో లేదా వ్యక్తిగతంగా ఎల్బీజీ భవన్ కారాలయంలో అందజేయవచ్చని తెలిపారు. వివరాలకు 9490300412ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారులు చంద్రమౌళీశ్వరరావు, శామ్యూల్, ఎంఈఓలు కిషోర్‌బాబు, సరస్వతి, వెంకారెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమోజు శ్రీనివాసరావు, ప్రకాశం బాలోత్సవ్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.వీరాంజనేయులు, సభ్యులు చిన్నస్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

27న త్రీ-ఏ సైడ్ జిల్లా వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

టంగుటూరు: త్రీ–ఏ సైడ్ వాలీబాల్ రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 27న శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు జూనియర్ కాలేజీలో నిర్వహించనున్నారని జిల్లా అసోసియేషన్ నాయకుడు సురేష్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 8790 49511ను సంప్రదించాలని సూచించారు. ఒరిజినల్ ఆధార్, బర్త్ సర్టిఫికెట్, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన జట్టు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు హర్యానా రోహతక్ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు.

మాట వింటేనే ఎస్ఆర్‌లో సంతకం!

- ముండ్లమూరు ఎంపీడీఓ వేధింపులపై ఉమామహేశ్వరపురం మహిళా పోలీస్ ఆవేదన
- చెప్పింది వినకపోతే జీతం ఆపుతానని ఉద్యోగులకు బెదిరింపులు
- పని వేళలకు సంబంధం లేకుండా విధుల అప్పగింతపై గగ్గోలు



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వివరాలు వెల్లడిస్తున్న కట్టా అనూష

ముండ్లమూరు(దర్శి):

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ ఉద్యోగుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. తాజాగా ముండ్లమూరు మండలంలో గ్రామ సచివాలయాల సిబ్బందితో ఎంపీడీఓ జనార్దన్ వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశమైంది. పని వేళలతో సంబంధం లేకుండా విధులు అప్పగించడం, రాత్రి వేళ, సెలవు దినాలు అనే తేడా పనులు చేయాలని వేధించడం, చెప్పింది వినకపోతే జీతం ఆపేస్తానని బెదిరిస్తున్న వైనంపై సచివాలయ ఉద్యోగులు కథలు కథలుగా చెప్పుకొంటున్నారు. టీడీపీ నేతల ప్రోద్బలంతో తనకు అనుకూలంగా ఉండే కొందరు పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఎంపీడీ వేధింపుల పర్వానికి తెరతీశారని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

టీడీపీ వారిని ఎందుకు రిగ్గింగ్ చేసుకోనివ్వలేదు?

ముండ్లమూరు మండలంలో 17 గ్రామ సచివాలయాలు ఉండగా 15 మంది మహిళా పోలీసులు పనిచేస్తున్నారు. ఎస్ఆర్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని ఇటీవల ఎస్పీ కార్యాలయం నుంచి ఆదేశాలిచ్చారు. 13 మంది మహిళా పోలీసుల ఎస్ఆర్ కాపీలో సంతకం చేసిన ఎంపీడీఓ.. ఉమామహేశ్వరపురం, పోలవరం గ్రామాల మహిళా పోలీస్‌లైన కట్టా అనూష, పాలపర్తి శ్రీదేవికి సంతకాలు చేయలేదు. వేతనం కూడా నిలిపేశారు. దీంతో కట్టా అనూష ఎంపీడీఓను కలిసి ప్రపోజల్ పంపాలని కోరగా అటువైపు నుంచి వచ్చిన సమాధానం విని షాక్‌కు గురైంది. 'ఎన్నికల వేళ దాడి కేసులో రాజీకి రావాలని చెప్పా. నీవు వైఎస్సార్ సీపీ జెండా మోస్తున్నావా? గత ఎన్నికల్లో టీడీపీ వారిని ఎందుకు రిగ్గింగ్ చేసుకోనివ్వలేదు' అని టీడీపీ నాయకుడిలా ఎంపీడీఓ మాట్లాడటం ఉద్యోగ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. 'ప్రభుత్వం టీడీపీది. నీవు కేసు రాజీకి వచ్చే వరకు నీకు జీతం ఎలా వస్తుందో చూస్తా'అని ఎంపీడీఓ అనడంతో కన్నీటిపర్యంతమైన అనూష.. తనకు ఎటువంటి పార్టీలు లేవని నా ఎస్ఆర్‌లో వివరాలు ఎంటర్ చేయాలని ప్రాధేయపడినట్లు సమాచారం. 'సక్రమంగా పనిచేస్తున్నా నన్ను ఇబ్బంది పెడుతున్నారు. నా వేతనం ఆపడం ధర్మం కాదు' అని అనూష చెబుతుండగా 'ఇక్కడ రాజకీయం చేస్తేనే ఉద్యోగాలు చేస్తారు. లేదంటే నీకు దిక్కున్న చోట చెప్పుకో' అని ఎంపీడీఓ కటువుగా మాట్లాడిన వైనాన్ని అనూష తోటివారితో చెప్పుకొని విలపించింది.

డిప్యుటేషన్‌పై భిన్న వాదనలు

ఉమామహేశ్వరపురం, పోలవరం గ్రామాల మహిళా పోలీసులను డిప్యుటేషన్‌పై అటు ఇటు మార్చారు. అయితే ఎస్పీ కార్యాలయం నుంచి ఆదేశాలివ్వకుండా డిప్యుటేషన్‌పై వెళ్తే తనకు ఇబ్బందులు ఎదురవుతాయని కట్టా అనూష చెబుతోంది. ఎంపీడీఓ మాత్రం వారిని డిప్యుటేషన్‌పై పంపి మూడు నెలలైనా వెళ్లకుండా ధిక్కరించారని చెబుతున్నారు. తనపై వస్తున్న ఆరోపణలపై ఎంపీడీఓను వివరణ కోరగా.. 'ఆమెను నేను ఎలాంటి అసభ్య మాటలు అనలేదు. ఎలాంటి కేసులు రాజీ చేసుకోమని చెప్పలేదు. గ్రామస్తుల అసంతృప్తి మేరకు డిప్యుటేషన్‌పై పంపా. డిప్యుటేషన్‌పై వెళ్తేనే ఎస్ఆర్‌లో సంతకం పెడతా' అని స్పష్టం చేశారు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల విలీనం



మాట్లాడుతున్న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

- పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు

ఒంగోలు సిటీ: విద్యార్థుల సంఖ్య ఆధారంగా క్లస్టర్, మండల, జిల్లా స్థాయిలో కమిటీల ద్వారా స్కూళ్లను విలీనం చేస్తామని పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎం.ఎస్ ఫంక్షన్ హాల్లో నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఎంఈఓలు, క్లస్టర్ హెచ్ఎంలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిషనర్ మాట్లాడుతూ.. పాఠశాల విద్యను బలోపేతం చేయడం కోసం జీవో 117ను మారుస్తూ మార్గదర్శకాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో 60 పైన విద్యార్థులు ఉన్నచోట మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి తరగతికి ఓ ఉపాధ్యాయుడు ఉండేలా చేస్తామన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 6,7,8 తరగతుల్లో 60 పైన విద్యార్థులు, మౌలిక వసతులు ఉంటే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. 30 మంది కంటే తక్కువ ఉంటే ప్రాథమిక పాఠశాలగా మారుస్తామన్నారు. దూరంగా ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో 60 లోపు విద్యార్థులు ఉంటే బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా మారుస్తామని, 1,2 వ తరగతులున్న చోట ఫౌండేషన్ స్కూళ్లు ఉంటాయని, అంగన్‌వాడీ సెంటర్లను కూడా ప్రైమరీ స్కూళ్లలో కలిపి పీపీ1, పీపీ2, క్లాసులుగా చేరుస్తామన్నారు. వర్క్‌షాపులో కలెక్టర్ తమీమ్ అన్సారియా, గుంటూరు ఆర్జేడీ, డీఈవోలు, ఉపవిద్యాశాఖాధికారులు, ఎంఈఓలు, క్లస్టర్ల హెచ్ఎంలు పాల్గొన్నారు.

జీవితం.. చదువుతోనే బంగారుమయం

- ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



ప్రభుత్వ బధిరుల పాఠశాలలో పదో తరగతి మెరిట్ విద్యార్థిని చరిష్మాని సన్మానిస్తున్న బత్తుల పద్మావతి, ఇతర అధికారులు

ఒంగోలు సిటీ: బాలబాలికలు చదువుకుని జీవితంలో అభివృద్ధి పథంలో నడవాలని బాలల సంరక్షణ అధికారులకు ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆకాంక్షించారు. గురువారం ఒంగోలులోని బాల సదన్, శిశుగృహను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బత్తుల పద్మావతి మాట్లాడుతూ.. చదువుపై ఆసక్తి కలిగిన బాలికలను గుర్తించి కేజీబీవీకి పంపాలని డీఈఓకు సూచించారు. ఇతర జిల్లాలకు చెందిన బాలికలను అక్కడికే పంపడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆధార్ లేని పిల్లల కోసం తగు చర్యలు తీసుకోవాలని పీఓఐసీకి, పిల్లలకు కౌన్సెలింగ్ ఇవ్వాలని డీసీపీయూ కౌన్సిలర్‌కు స్పష్టం చేశారు.

జిల్లా వ్యాప్తంగా తనిఖీల్లో భాగంగా ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. బధిర విద్యార్థులకు తగిన ఆహారం, విద్య అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. బధిర బాలబాలికలకు హెల్త్‌కార్డులు, ప్రత్యేక హెల్ప్‌లైన్ ఉండేలా చూడాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఆర్ఆర్ఎం పాఠశాలలోని బాలికలకు వివిధ అంశాలపై సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ నెల 30, 31వ తేదీల్లో రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో డిపార్ట్‌మెంటల్ రివ్యూ మీటింగ్ నిర్వహించడానికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీఓ దినేష్‌కుమార్, బాలసదనం సూపరింటెండెంట్ జీవిత, ఇన్‌చార్జ్ హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు రమణ, లీగల్ కం ప్రొబేషన్ ఆఫీసర్ రత్నప్రసాద్, సోషల్ వర్కర్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

చర్చలు కాదు.. పంటలకు మద్దతు ధర కావాలి

- రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్రం విడనాడాలి
- కార్మిక చట్టాలు, స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి
- కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 26న మోటార్ సైకిల్, ట్రాక్టర్ ర్యాలీ
- సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ రంగారావు



ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతున్న రైతు సంఘ నాయకులు

ఒంగోలు సిటీ: కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26వ తేదీన ఒంగోలులో నిర్వహించనున్న జిల్లా స్థాయి మోటారు సైకిల్, ట్రాక్టర్ ర్యాలీలను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నం పెట్టే రైతుల ను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ధ్వజమెత్తారు. రైతు ఉద్యమానికి తలవంచి రద్దు చేసిన నల్ల వ్యవసాయ చట్టాలను తిరిగి అమలు చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన సహకార, వ్యవసాయ సాంకేతిక చట్టాలు మొత్తం రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల పెత్తనం కిందకి తెచ్చేందుకేనని దుయ్యబట్టారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని కాపాడుతున్న కౌలు రైతులకు నేరుగా పంట రుణాలు ఇవ్వడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం సంభవిస్తే పరిహారం కౌలు రైతులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి, జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, జిల్లా కార్యదర్శి లలిత కుమారి, కె.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు, టచ్‌ఫోన్లు, వీల్‌చైర్లు

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు, టచ్ ఫోన్‌లు, మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్లు, చంక కర్రలు, వయో వృద్ధులకు వినికిడి యంత్రాలు అందిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి. అర్చన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాప్‌టాప్‌లకు డిగ్రీ, ఆపైన చదివే విద్యార్థులు, టెక్నికల్ కోర్సు చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. వీరు సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, 10వ తరగతి ధ్రువీకరణ పత్రం, కులం ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్న కళాశాల ధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు. టచ్ ఫోన్‌లకు ఇంటర్మీడియెట్ పాసైన బధిర విద్యార్థులు అర్హులన్నారు. మూడు చక్రాల సైకిల్, వీల్ చైర్, సంక కర్రలు, డైసీ ప్లేయర్, ఫోల్డింగ్ వాకింగ్ స్టిక్, వృద్ధుల చేతి కర్రలు, కాలిపర్స్‌కు వైకల్య ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, కులం ధ్రువీకరణ పత్రం, ఆదాయ పత్రం, రేషన్ కార్డు, రెండు ఫొటోలు అవసరమని తెలిపారు. వినికిడి యంత్రం మంజూరుకు వైకల్య ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, కులం ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, రెండు ఫొటోలు, అడియో గ్రామ్ ధ్రువీకరణ పత్రం, సివిల్ సర్జన్ ధ్రువీకరణ పత్రం అవసరమన్నారు. అర్హత ఉన్న దివ్యాంగులు, వయో వృద్ధులు 08592–281310 అనే నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బంధువులు మందలించారని..

- పదో తరగతి బాలుడు ఆత్మహత్య
- గొట్టిపడియ డ్యామ్‌పై నుంచి దూకిన వైనం



మృతి చెందిన సుబ్బయ్య

మార్కాపురం టౌన్: బంధువులు మందలించారన్న క్షణికావేశంలో ఓ బాలుడు అర్ధంతరంగా తనువు చాలించాడు. ఈ సంఘటన కుటుంబ సభ్యులు మార్కాపురం రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని గొట్టిపడియ డ్యామ్ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. మార్కాపురం మండలంలోని జంకె రామిరెడ్డి కాలనీకి చెందిన కన్నెబోయిన ఆంజనేయులు, బాలేశ్వరి దంపతుల కుమారుడు సుబ్బయ్య(16) వైఎస్సార్ జిల్లా ఖాజీపేటలో ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదవుతున్నాడు. కొద్ది రోజులుగా సుబ్బయ్య ప్రవర్తన సరిలేదని ఖాజీపేటలో ఉన్న బంధువులు మందలించారు. దీనిని జీర్ణించుకోలేని ఆ బాలుడు ఎవరికీ చెప్పకుండా ఆర్టీసీ బస్సులో మార్కాపురం మండలం కుంట వద్దకు చేరుకున్నాడు. అదే ఆవేశంలో వెలుగొండ ప్రాజెక్టులో భాగమైన గొట్టిపడియ డ్యామ్‌పైకి చేరుకుని కిందకు దూకాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్సై అంకమరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

- బెంగళూరులో బుధవారం రాత్రి ఘటన



మృతి చెందిన వెంకటేశ్వరరెడ్డి

ముండ్లమూరు(దర్శి): బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముండ్లమూరు మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి(28) మృతి చెందాడు. బెంగళూరులోని ఎక్సెల్ నీట్ అకాడమీ సెంటర్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరెడ్డి బుధవారం రాత్రి 10 గంటల సమయంలో హాస్టల్ నుంచి భోజనానికి వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. వెంకటేశ్వరరెడ్డి ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో స్నేహితులు, బంధువులను హాస్టల్ వార్డెన్ ఎడమకంటి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరాతీశాడు. ఆచూకీ లేకపోవడంతో దగ్గర్లోని యలహంక తాలూకా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదంలో మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తిని పరిశీలించాలని సూచించారు. ఆ మృతదేహం లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డిదిగా హాస్టల్ వార్డెన్, బంధువులు గుర్తించారు. ఈ మేరకు గురువారం తల్లిదండ్రులకు సమాచారం తెలియజేశారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు బెంగళూరు బయలుదేరి వెళ్లారు.

అర్ధరాత్రి వేళ.. ఎందుకబ్బా?

- మార్కాపురంలో పాత అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ కూల్చివేత



జేసీబీతో హెల్త్ సెంటర్ భవనాన్ని కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు

మార్కాపురం: పట్టణ నడిబొడ్డులో టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ భవనాన్ని అధికారులు గురువారం రాత్రి వేళ కూల్చివేశారు. శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని రాత్రి వేళ మున్సిపల్ అధికారులు కూల్చివేయడం చర్చనీయాంశమైంది. సుమారు 50 ఏళ్లపాటు ఈ భవనంలో వైద్య సిబ్బంది సేవలు అందించారు. గతంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలు వేసేవారు. కాలక్రమేణా శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం ఈ భవనం నిరుపయోగంగా ఉంది. వైద్యారోగ్య శాఖ సిబ్బంది తమ రికార్డులు భద్రపరిచేందుకు ఉపయోగించుకుంటున్నారు. అర్ధరాత్రి కూల్చివేతల కార్యక్రమం చేపట్టడంతో పట్టణ వాసులతోపాటు వ్యాపార వర్గాల్లో మళ్లీ ఆందోళన మొదలైంది.